క్లుప్తంగా

ప్రతి ఇంటికి యాజమాన్య హక్కు

పుల్లంపేట : ప్రతి ఇంటికీ యాజమాన్య హక్కు కల్పించడమే స్వామిత్వ సర్వే ప్రధాన ఉద్దేశమని ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. మండలంలోని అనంతయ్యగారిపల్లిలో జరుగుతున్న స్వామిత్వ సర్వే పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 17 రెవెన్యూ గ్రామాలలో స్వామిత్వ సర్వే కొనసాగుతుందని, సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతి ఇంటినీ సర్వేచేసి వారికి యాజమాన్య హక్కు పత్రాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రతి గృహానికి సరిహద్దులు కచ్చితంగా కొలిచి రికార్డులలో నమోదు చేసి ఎలాంటి తగాదాలు లేకుండా పక్కా యాజమాన్య పత్రాలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

వరిలో కాలిబాటలతో దిగుబడి

వీరబల్లి : వరిలో కాలిబాటలతో మంచి దిగుబడి వస్తుందని వెలుగు ఏపీఎం ఖాదర్ వలీ అన్నారు. బుధవారం కమ్మపల్లి రామ్ ప్రసాద్ అనే రైతు పొలంలో వరినాటును పరిశీలించారు. సమీకృత వ్యవసాయ పథకంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వరినారు కొనలు కత్తిరించడం వల్ల ఎక్కువ పిలకలు వస్తాయన్నారు. కాలిబాటలు ఉంచడం వల్ల మొక్కకు కావాల్సిన గాలి, వెలుతురు అంది చీడపీడలకు అవకాశం తక్కువ ఉంటుందన్నారు. వరిసాగులో అజోళ్ల వేయడం వల్ల మంచి పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సీసీ గంగాధరం, మండల యాంకర్ పర్సన్ అనిత, సీఆర్‌పీ రెడ్డమ్మ, ఫార్మర్ మిత్ర వెంకటేష్ పాల్గొన్నారు.

ఉన్నత పదవులే లక్ష్యంగా చదవాలి

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంపీడీఓ ఉషారాణి పేర్కొన్నారు.. ఏపీ మోడల్ స్కూల్ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ సుధారాణి, ఎంఈఓ వెంకటసుబ్బయ్యలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లోనే భవిష్యత్తును ఎంపిక చేసుకొని కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉన్నత పదవులను దృష్టిలో పెట్టుకొని చదువుకోవాలన్నారు. ముఖ్యంగా మానవతా విలువలతో చదువుకోవాలని, 2013వ సంవత్సరం నుంచి ఏపీ మోడల్ స్కూల్‌లో పది, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించడం గొప్పవిషయమన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఎంతోమంది మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎనమల మణి, విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపల్ రాజకుమార్, సంబేపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందాం

సుండుపల్లె : బూత్ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీల ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్ తెలిపారు. బుధవారం జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆదేశానుసారం వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి పిలుపుమేరకు బూత్‌స్థాయి కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి బూత్ కమిటీల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి జిల్లాలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందామని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇస్మాయిల్, అన్నమయ్య జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులు చంద్రానాయక్, సంతోష్‌రెడ్డి, పెద్దినేనికాలువ ఉపసర్పంచ్ రఫీక్ పాల్గొన్నారు.

బొప్పాయి రైతులను ఆదుకోండి

ఓబులవారిపల్లె : రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలోని బొప్పాయి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం సీఐటీయూ నాయకులు బుధవారం సబ్ కలెక్టర్ భావనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారుల సిండికేట్ కారణంగా బొప్పాయి ధర ప్రస్తుతం ఐదు రూపాయలుగా నిర్ణయించారని, దీంతో రైతులకు ఆత్మహత్యే శరణ్యమని అన్నారు. బొప్పాయి ధరల పట్ల జిల్లా కలెక్టర్ ఆగస్టు ఒకటో తేదీన దళారులు, వ్యాపారులతో అనంతరాజుపేట వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ నందు సమావేశం నిర్వహించి కనీస ధర పది రూపాయలుగా నిర్ణయించారన్నారు. ఆ విధంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఇందుకు సబ్ కలెక్టర్ స్పందించి కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ చంద్రశేఖర్, చిట్వేలి రవికుమార్, ఆదినారాయణ, కొత్తపల్లి ఈశ్వరయ్య, శివకేశవ రెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులను కాపాడాలి

రాయచోటి టౌన్ : పాలకులు మైనార్టీ సమాజాన్ని మానసికంగా దెబ్బకొడితే దేశం ప్రశాంతంగా ఎలా ఉంటుందని ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రాయచోటి ఎన్‌జీఓ హోంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆప్ కి ఆవాజ్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం మాట్లాడుతూ దేశంలో భాగమైన మైనార్టీ సమాజాన్ని దెబ్బకొడితే దేశం ఎలా ప్రశాంతంగా ఉంటుందని పాలకులను ప్రశ్నించారు. దేశం ప్రశాంతంగా ఉండాలన్నా, సురక్షితంగా ఉండాలన్నా మైనార్టీల హక్కులకు భంగం కలగనీయకుండా ఉండాలని కోరారు.

కంది.. కనిపించడం లేదు?

- రేషన్ షాపులకు సరఫరా కాని నిత్యావసర సరకు
- ఎప్పుడు అందిస్తారో తెలియక పేద, మధ్య తరగతి ప్రజల సతమతం



రాయచోటి జగదాంబసెంటర్ : ప్రజలు నిత్యం వాడే సరుకులలో కందిపప్పు ఒకటి. కందిపప్పు ధర ఆకాశన్నంటిన రోజుల్లోనూ కచ్చితంగా ఇంట్లో రెండు, మూడు రోజులకు ఒకసారైనా వాడాల్సిందే. అలాంటి నిత్యావసర సరుకును గత ప్రభుత్వం పేదలకు రేషన్ దుకాణాల ద్వార సరఫరా చేసేది. వివిధ కారణాలతో ఎన్నికలకు కొన్ని నెలల ముందు కంది సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఎన్నికల్లో కూటమి పార్టీలు గెలిచి ఏడాదిన్నర కావస్తున్న ఇప్పటికీ రేషన్ దుకాణాల్లో కంది కనిపించడంలేదు. ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని సందర్భాలు నెలకొన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లలో కందిపప్పు ధర రూ.150 వరకు ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అందిస్తున్న రేషన్ బియ్యం మోతాదును తగ్గించి కాస్త అయినా కందిపప్పు అందించాలని కోరుతున్నారు. కంది సరఫరా గురించి కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా.. సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కొందరు కార్డుదారులు బియ్యం ఒకటి ఇస్తే ఏమీ చేసుకోవాలి, కుటుంబానికి సరిపడా కందిపప్పును అందించాలని డీలర్ల దగ్గర తమ బాధను తెలియజేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద, మధ్య తరగతి ప్రజల ఆవేదనను పరిగణనలోకి తీసుకొని రేషన్ దుకాణాల ద్వారా కందిని సరఫరా చేయాలని విన్నవిస్తున్నారు.

పేదలకు పంపిణీ చేయాలి



రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. నిత్యావసర సరుకు అయినా కందిపప్పును రేషన్ కార్డుదారులకు అందించడం సర్కారు బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దుకాణాలకు అందజేసి పేదలకు పంపిణీ చేయాలి.

- ఎ.రామాంజులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, రాయచోటి

కందిపప్పు లేదట



రేషన్‌షాపుల్లో బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో రేషన్‌షాపులలో రూ.70లకే కందిపప్పు ఇచ్చేవారు. దీనివల్ల కుటుంబానికి కొంత ఆసరాగా ఉండేది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి పేద కుటుంబాలను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కె.పెద్దరెడ్డయ్యరాజు, మదనపల్లి రోడ్డు, రాయచోటి

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పేదలకు పెద్దపీట

రాయచోటి జగదాంబసెంటర్ : పేద, బలహీన, బడుగు వర్గాలకు పెద్దపీట వేసింది జగన్ ప్రభుత్వమేనని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి మండలం పెమ్మాడపల్లె గ్రామం గరుగుపల్లెలో శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. అందరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా గరుగుపల్లె వాసులు శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో అర్హత ఉంటే సంక్షేమ పథకాలు అందేవని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చెప్పిన మేరకు సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదన్నారు. వర్షాభావ పరిస్థితులతో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఎటువంటి పంటల నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు అందడం లేదని వారు ఆవేదనగా చెప్పారు. ఈ ప్రభుత్వంలో తొలి ఏడాది రైతు భరోసా డబ్బులు కూడా అందివ్వలేదని రైతులు వాపోయారు.

వైఎస్‌ఆర్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని మరువలేం..

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో తమ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందని గరుగుపల్లె గ్రామస్తులు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ ఆర్‌సీపీ హయాంలో గరుగుపల్లెకు 380 పక్కా గృహాలు మంజూరు, గ్రామ రహదారుల అభివృద్ధి, విలేజ్ క్లినిక్ నిర్మాణం, ఆలయం నిర్మాణం, ప్రాథమికోన్నత పాఠశాలని పదవ తరగతి వరకు ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడం, చెరువులకు ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు అందించడం లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాలను గ్రామస్తులు గుర్తుచేశారు. అంతకుముందు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో బాలు, సురేంద్ర, ప్రసాద్, దేవేంద్ర, రమణ, సుబ్బరాయుడు, రాజు, బసవరాజు, గంగరాజు, నరసింహులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలి

పుల్లంపేట : ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు తమ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ మురళీ సూచించారు. మండల పరిధిలోని జాగువారిపల్లి, దళవాయిపల్లి, కొత్తపేట, అనంతంపల్లి గృహనిర్మాణ లేఅవుట్‌లలో లబ్ధిదారులతో ఆయన బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. లబ్ధిదారులతో ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. లక్ష్యాలను పూర్తి చేయడంలో అందరూ సహకరించాలని కోరారు. నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారుల బిల్లులను త్వరితగతిన చెల్లించాలంటూ సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ విజయ్ కుమార్, సీఓ గౌస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దవటం : ఎంపీడీఓ కార్యాలయ పరిపాలన అధికారి (ఏఓ)గా బుధవారం సోమశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏఓగా పని చేసిన లక్ష్మిదేవి జిల్లా మెప్మా ఇన్‌చార్జ్ పీడీగా బదిలీపై వెళ్లారు. కాగా ఒంటిమిట్ట ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న సోమశేఖర్ బదిలీపై సిద్దవటానికి వచ్చారు.

పీఆర్‌సీని ఏర్పాటు చేయాలి

సుండుపల్లె : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్‌సీని వెంటనే ఏర్పాటు చేసి, ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ సీనియర్ నాయకులు ఎస్.రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం సుండుపల్లి, తిమ్మసముద్రం, మడితాడు, రాయవరం క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌సీ ఏర్పాటులో ఇప్పటికే 25 నెలలు ఆలస్యమైందని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ మైనార్టీ కో-కన్వీనర్ ఆరీఫుల్లా, జిల్లా నాయకులు గణపతినాయక్, బీమ్లానాయక్, ఇస్మాయిల్, ఆంజనేయులు, ప్రసాద్‌రెడ్డి, సీపీఎస్ కన్వీనర్ అంజద్ బాషా, నదీమ్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని దవంతరపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి వృద్ధాప్య సమస్యతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి మృతుని స్వగ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ దున్నుతుల లక్ష్మీనారాయణ రెడ్డి, గుండు మల్లికార్జునరెడ్డి, ఓబుల్ రెడ్డి, కొండమాచుపల్లి సర్పంచ్ మేరువ శివనారాయణ, రవిచంద్రారెడ్డి, నాగార్జునరావు, రామయ్య యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.

తిరుణంపల్లి వాసుల తిప్పలు ఎన్నడు తీరేనో?

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీ తిరుణంపల్లి ప్రజలు వర్షాకాలంలో మండల కేంద్రానికి రావాలంటే నానా అవస్థలు పడాల్సి ఉంటుంది. పంచాయితీ మారుమూల ప్రాంతం కావడంతో ఏ అవసరమున్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిందే. వైద్యం అత్యవసరమైనప్పుడు, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా, పొలాలకు వెళ్లాలంటే కూడా ఇబ్బందులు తప్పడంలేదు. రహదారి సమస్య ఏళ్లుగా ఉన్నా రాజకీయ నాయకులు పరిష్కరిస్తామని హామీలు గుప్పిస్తున్నా రోడ్డు నిర్మాణం పంచాయతీ ప్రజల తీరని కలగానే మిగులుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలు వచ్చేందుకు వీలుగా తిరుణంపల్లి గ్రామస్తులు వారి సొంత నిధులతో మట్టి, రాళ్లతో మార్గం వేసుకోగా, సోమశిల వెనుక జలాలు తీవ్రత కాస్త పెరిగితే ఆ మట్టి కూడా కొట్టుకుపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు స్పందించి ప్రభుత్వం ద్వారా వంతెన నిర్మించాలని ప్రజలు కోరుకుంటున్నారు. స్థానిక శాసనసభ్యులు శ్రీధర్ దీనిపై వెంటనే స్పందించి అసెంబ్లీలో ప్రస్తావించడమే కాకుండా సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి గుంజనేరుపై వంతెన త్వరితగతిన నిర్మించి ఈ ప్రాంతవాసుల కష్టాలు తొలగించాలని విన్నవిస్తున్నారు.



నిర్మాణానికి నోచుకోని తిరుణంపల్లి గుంజనేరు బ్రిడ్జి

విద్యార్థుల ఎదుగుదలలోనే ఉపాధ్యాయుడి విజయం

గాలివీడు : విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యాలతో చదువులో రాణించి, ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే ఉపాధ్యాయుడు తన వృత్తిలో విజయం సాధించినట్లు అని ఎంఈఓ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం గోరాన్‌చెరువు గ్రామంలోని దాసరివాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన సీనియర్ ఉపాధ్యాయుడు చిన్నకోట్ల రమణను పాఠశాల ఉపాధ్యాయులు దివ్యాంజనమ్మ, ఉలసల నాగరాజులు ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యున్నతమైనదని ఎంతో మంది విద్యార్థుల తలరాతలు మార్చగల శక్తి ఒక్క ఉపాధ్యాయునికే ఉందని గుర్తుకు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వి.శ్రీనివాసులు, ఎగువగొట్టివీడు హైస్కూల్ హెచ్‌ఎం సదాశివరెడ్డి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, వివిధ సంఘాల నాయకులు, సీనియర్ ఉపాధ్యాయులు, దాసరివాండ్లపల్లె ప్రజలు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

మా పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించండి

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ గ్రామంలోని తన పొలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన ట్రాన్సుఫార్మర్‌ను తొలగించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరీ రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని భాకరాపేటలో బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి రెవెన్యూ గ్రామంలోని నరవకాటిపల్లి కణం బావివద్ద ఉన్న సర్వే నెంబరు 1090-4లో ఏర్పాటు చేసుకోవాల్సిన ట్రాన్సుఫార్మర్, విద్యుత్ స్తంభాలు పెద్దపల్లి రెవెన్యూ గ్రామంలోని భాకరాపేట గ్రామంలోని సర్వేనెంబరు. 858-2, 858-3లోని తమ పొలంలో ట్రాన్సుఫార్మర్‌ను ఏర్పాటు చేసి తన భూమిని కబ్జా చేసేందుకు ఒంటిమిట్టలోని విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి గుర్రంపాటి మోహన్ రెడ్డి యత్నిస్తున్నాడని ఆరోపించారు. సిద్దవటం రెవెన్యూ అధికారులు ట్రాన్సుఫార్మర్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకపోయినా ఒంటిమిట్ట విద్యుత్‌శాఖ అధికారులు మోహన్ రెడ్డికి అనుమతులు ఎలా ఇచ్చారని ఆమె ధ్వజమెత్తారు. అతనిపై సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే మండల, జిల్లా ఉన్నతాధికారులకు అర్జీలు అందించామని, తనకు న్యాయం చేయకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహిళా సంఘాలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శృతి స్వచ్ఛంద రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శి నాగలారపు అరుణ, సభ్యులు మీనాక్షి, ఆయేషా, సుబ్బరత్నమ్మ, కరిమున్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవికుమార్‌ను కోరారు. బుధవారం రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో ఆయన్ను గౌరవంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయనకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, సకాలంలో అందేలా చూడాలన్నారు. అలాగే మెటర్నటీ, పెటర్నిటీ లీవ్‌లు త్వరగతిన మంజూరు చేయాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ రాయచోటి తాలూకా అధ్యక్షులు వెంకటేశ్వర రెడ్డి, సహాయ అధ్యక్షులు మహదేవ, కోశాధికారి దేవేంద్ర, వైస్ ప్రెసిడెంట్ రవిశంకర్, హరిప్రసాద్, రాఘునాయక్, రామకృష్ణ యాదవ్, వార్డు సెక్రటరీలు లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్, విజయ్, రాధాప్రతాప్, శ్రీనివాసయాదవ్, బాలాజీ నాయక్‌లు పాల్గొన్నారు.




మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఏపీఎన్‌జీఓలు

దర్గా అభివృద్ధికి వక్ఫ్ బోర్డు సహకారం

సిద్దవటం : సిద్దవరం దర్గా అభివృద్ధికి వక్ఫ్ బోర్డు సహకరిస్తుందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు గౌరవ సభ్యులు బేపారి జాకీర్ అహమ్మద్ తెలిపారు. సిద్దవటం పత్తుమియా మసీద్‌లో అసారే షరీఫ్ ఉరుసు మహోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఆయన సిద్దవటానికి విచ్చేశారు. ఆయన మసీద్ ముత్తువల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రీ, ఆయన కుమారుడు సయ్యద్ నిజరే ఆలం ఖాద్రీలు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యంత ప్రాచీన మహమ్మద్ ప్రవక్త చారిత్రాత్మక అవశేషాలను పదిలంగా ఉంచడంతో ముస్లిం సహోదరులు ప్రతి ఏటా సందర్శించడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఖ్యాతిని రాష్ట్ర నలువైపులా విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటం సాగిస్తుందని ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీ చేపట్టిన ఛలో విజయవాడ పోస్టర్‌ను బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా విద్యారంగ సమస్యల పరిషారం కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. పాఠశాలలు, కళాశాలల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి లేదంటూ ఇచ్చిన జీఓను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ ఛార్జీలను మూడువేల రూపాయలకు పెంచాలన్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసే జీఓ నెంబర్ 45, 35ను రద్దు చేయాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఈనెల 6వ తేదీ తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం కాగలవని తెలిపారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఘనంగా గణనాథుని నిమజ్జనం



నందలూరు: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



రాయచోటి : భక్తులకు ఆహారం వడ్డిస్తున్న ప్రసాద్‌బాబు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ ఎన్‌టీఆర్ నగర వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన 8 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడికి బుధవారం ఘనంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, వసంతాలు చల్లుకుంటూ యువకులు, మహిళలు, చిన్నారులు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం కన్యక చెరువులో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

రాయచోటి జగదాంబసెంటర్ : భక్తులకు ఏర్పాటు చేసే అన్నప్రసాదాల పంపిణీ పుణ్యకార్యమని టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం పాతరాయచోటిలోని వాల్మీకివీధిలో వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు.

రూ.2.7లక్షలు పలికిన గణేష్ లడ్డూ

రాజంపేట రూరల్ : మండలంలోని నారపరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద లడ్డూ వేలంలో రూ.2.7లక్షలు పలికింది. బుధవారం జరిగిన వేలం పోటాపోటీగా సాగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ పిండిబోయిన రాముయాదవ్ రూ.2.7లక్షలకు పడి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు రాముయాదవ్‌ను సత్కరించి లడ్డూను అందజేశారు. అనంతరం స్వామివారిని వేడుక నడుమ నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనంలో వెంకటసుబ్బయ్య యాదవ్, వెంకటరమణ యాదవ్‌లతో పాటు గ్రామ ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ ఎన్‌టీఆర్ నగర్ వద్ద వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం నిర్వహించిన వేలం పాటలో లడ్డూను రూ.45 వేలకు అదే ప్రాంతానికి చెందిన రేగిమడుగు సుబ్బారావు దక్కించుకున్నారు. అనంతరం రేగిమడుగు సుబ్బారావును మేళతాళాల నడుమ ఊరేగింపుగా లడ్డూను ఇంటికి తీసుకువెళ్లారు.



రాజంపేట రూరల్: రూ.2.7లక్షలకు లడ్డూను దక్కించుకున్న పిండిబోయిన రాముయాదవ్



నందలూరు: లడ్డూను దక్కించుకున్న సుబ్బారావు

వినాయకుడి కరుణ అందరిపై ఉండాలి

గాలివీడు : సర్వ విఘ్నాలను తొలగించి, సర్వ శుభాలను గణనాథుడు ప్రజలందరికీ ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు గాలివీడులోని ఉత్తరగడ్డ అరుంధతివాడలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బుధవారం శ్రీకాంత్ రెడ్డి సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. అనంతరం ఉత్తరగడ్డ అరుంధతివాడ, పెడకంటి కొత్తపల్లె ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమస్యలు, కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆరా తీశారు. అనంతరం ఆయన, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంతో కలిసి మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వెనుక భాగంలో ఇటీవల గృహ ప్రవేశం చేసిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ రంగనాయుని వినోద్ నాయుడు నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే మండలంలోని ప్యారంపల్లె గ్రామం పెడకంటి కొత్తపల్లెకు చెందిన బుడ్డామల్‌రెడ్డి కుమారుడి వివాహ వేడుకకు గడికోట, సుగవాసి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాలలో నాయకుల వెంట మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్ రెడ్డి, నాయకులు నిజాముద్దీన్, నాగభూషణ్ నాయుడు, సుధాకర్ రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ రమణా రెడ్డి, వండాడి హరి, రెడ్డయ్య, సమీర్, పరశురాం, రెడ్డి కుమార్, ఆంజనేయులు రెడ్డి, గంగాధర్ నాయుడు, శ్రీనివాసులు, బి.కె. రమణ, సభాపతి, రాజా, హరిప్రసాద్, మనోహర్, వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి

దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రొద్దుటూరు తరువాత రాజంపేట పట్టణంలోని అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలను ఆర్యవైశ్యులు వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 22వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నందున ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధే సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం ఆలయ ముఖ ద్వారం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభ సోమయాజుల నరసింహులు నేతృత్వంలో పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అలంకరణ పనులకు అంకురార్పణ చేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయనున్నట్లు ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి శాల ప్రాంగణంలోనే కాక పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లో భక్తులను కనువిందు చేసేలా అలంకరణలు ఉంటాయన్నారు. ఈ ఏడాది కడపకు చెందిన కళాకారులు అలంకరణ పనులు, అమ్మవారు ప్రత్యేక అలంకరణలను నెల్లూరుకు చెందిన కళాకారులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. ఉత్సవాలలో భక్తులు రద్దీ దృష్ట్యా ప్రతిరోజు వేకువజాము నుంచి అమ్మవారి గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తారని, అందువల్ల భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అలాగే పదిరోజుల పాటు జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా నిత్యం అమ్మవారిశాలకు వేలాది మంది భక్తులు వస్తారని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు రాత్రి వేళల్లో గాంధీ సర్కిల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు పత్తి నాగరాజ, సనిశెట్టి వెంకటేశ్వర్లు, గూనిపూటి మణి, మేడా మునిబాలకృష్ణ, పేరకం శంకర్‌శెట్టి, సురేష్, నవీన్, సుబ్రమణ్యం, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణ పనులకు అంకురార్పణ చేస్తున్న పురోహితులు

పౌష్టికాహార ప్రయోజనాలు తెలుసుకోవాలి

సిద్దవటం : పౌష్టికాహార ప్రయోజనాలను అందరూ తెలుసుకోవాలని బెటాలియన్ యూనిట్ ఆసుపత్రి వైద్యాధికారిణి డాక్టర్ దివ్యరాణి పేర్కొన్నారు. బుధవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'మన పిల్లే మన ఆస్తి, భవిష్యత్తు – వారి ఆరోగ్యాలను కాపాడుకుందాం' నినాదంతో రూపొందించిన కరపత్రాలను బెటాలియన్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. పౌష్టికాహార ప్రాముఖ్యత, కలిగే లాభాలను వివరించారు. తగిన పౌష్టికాహారం తీసుకోకపోతే వచ్చే వ్యాధులపై జాగృతి చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు షామీర్ బాషా మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం కాపాడటం మనందరి బాధ్యతన్నారు. మన సాంప్రదాయ ఆహార భాగ్యమైన చిరుదాన్యాలు పిల్లల ఆహారంలో చేర్చడం వల్ల బలాన్ని, రోగ నిరోధక శక్తిని పెంచవచ్చన్నారు. పిల్లలు ఆరోగ్యకరంగా ఉండాలంటే సమాజం మొత్తం పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు.